క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్ట



జ్ఞాన సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్న ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు తదితరులు

రేగిడి: మండలంలోని లచ్చారాయపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో జ్ఞాన సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ట శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విగ్రహాన్ని విజయనగరం జ్ఞాన సరస్వతీదేవి దేవాలయం వారు అందజేశారని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

31న పీడీఎస్ బియ్యం వేలం

రాజాం సిటీ: మండల పరిధిలోని పలుచోట్ల వివిధ కేసుల్లో పట్టుబడిన 123.04 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఈ నెల 31వ తేదీన వేలం వేయనున్నట్లు తహసీల్దార్ పి.విజయభాస్కర్ ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్ దగ్గర భద్రపరిచిన ఈ బియ్యాన్ని కైవసం చేసుకునేందుకు ఆసక్తి ఉన్న వారు ముందుగా రూ.2 వేలు డిపాజిట్ చేసి, వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని వివిధ ప్రాంతాల్లో 6–ఏ కేసు కింద పట్టుబడిన 108.15 పీడీఎస్ బియ్యంను ఈ నెల 31వ తేదీన వేలం వేయనున్నట్లు తహసీల్దార్ ఎస్.రాజారావు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు రూ.2 వేలు చెల్లించి, వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు.

శరవేగంగా కేజీబీవీ భవన నిర్మాణం



నిర్మాణ దశలో కేజీబీవీ కొత్త భవనం

రాజాం: మండలంలోని గురవాం గ్రామం వద్ద కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం) భవన నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. దాదాపు రూ.1.60 కోట్ల మనబడి నాడు–నేడు నిధులతో ఈ భవనం నిర్మిస్తున్నారు. మరో 3 నెలల్లో పనులు పూర్తి చేసి, ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఏఈ జగదీష్ తెలిపారు.

మెడికల్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు



మెడికల్ షాపులో తనిఖీలు చేస్తున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఇందిరాభారతి

బొబ్బిలి: పట్టణంలోని పలు మెడికల్ షాపుల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఇందిరాభారతి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణాల లైసెన్స్, మందుల నిల్వల రికార్డులు, వాటి కాలం చెల్లిన తేదీలను పరిశీలించారు. నిబంధనలు అతిక్రమిస్తూ ఏవైనా నిషేధిత మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేత్ర శస్త్రచికిత్సకు 12 మంది ఎంపిక



వృద్ధుడికి కంటిని పరీక్షిస్తున్న వైద్యుడు కిరణ్‌కుమార్

బొబ్బిలి రూరల్: మండలంలోని ఎం.బూర్జవలస గ్రామంలో సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి హాజరైన దాదాపు 70 మంది కళ్లను వైద్యుడు కిరణ్‌కుమార్ పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ క్రమంలో 12 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేశామని వైద్యుడు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ డివిజన్ కార్యదర్శి డి.వాసు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రుణాల రెన్యువల్ చేసుకోండి

రేగిడి: సంకిలి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా తీసుకున్న రుణాలను రెన్యువల్ చేసుకోవాలని సొసైటీ చైర్మన్ రాయపురెడ్డి కృష్ణారావు శుక్రవారం తెలిపారు. ఫిబ్రవరి నెలాఖరులోగా రుణాలు రెన్యువల్ చేసుకుంటే 4 శాతం వడ్డీ వర్తిస్తుందన్నారు. కాలపరిమితి దాటి రెన్యువల్ చేయించుకుంటే 13 శాతం వడ్డీ పడుతుందని తెలిపారు. రుణాల రెన్యువల్‌కు ఆధార్‌కార్డు, 1–బి తీసుకుని సొసైటీ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

గడప గడపకూ 'సంక్షేమ' ఫలాలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

మెంటాడ:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో గడప గడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. శుక్రవారం మండలంలోని బడేవలస గ్రామంలో రెండోరోజు జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి, మూడున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన కొనసాగుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల బాగోగుల కోసం నిరంతరం పరితపిస్తున్నారన్నారు. ఆయన ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు వచ్చాయన్నారు. ఎన్నో ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. మరెన్నో సంక్షేమ పథకాలు అర్హులకే అందుతున్నాయన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీదేనన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పాలనకు నిదర్శమన్నారు. ప్రజల్లో పార్టీకి పెరుగుతున్న ఆదరణను చూసి, ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. గతంలో ఎన్నో హామీలు ఇచ్చి, విస్మరించిన టీడీపీకి మరో అవకాశం ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ విజయభేరి మోగిస్తుందన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఆ దిశగా అడుగులు వేయాలని డిప్యూటీ సీఎం కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మీసాల పార్వతి, ఎంపీటీసీ సువ్వాని విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎంఈఓ తిరుమలప్రసాద్

రామభద్రపురం: విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంఈఓ తిరుమలప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక గ్లోబల్ వ్యూ స్కూల్‌లో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశమైన ఆయన ఇటీవల తాను మండలంలోని ఓ పాఠశాలను సందర్శించానని, అక్కడి పాఠశాల దారుణంగా ఉండడంతో పాటు ప్రధానోపాధ్యాయుడు కూడా విధుల్లో లేరని, పిల్లలు బయట ఆడుకుంటున్నారని తెలిపారు. ఇలా అయితే కఠిన చర్యలు తీసుకోవడం తప్పదన్నారు. ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థి విద్యాప్రగతిపై దృష్టి సారించాలని, వారి విద్యాసామర్థ్యాలు మెరుగుపరిచేందుకు కృషి చేయాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ పాఠశాల హెచ్ఎంలు 15 రోజులకోసారి ఆ పాఠశాల పరిధిలో రివ్యూ నిర్వహించి, రిపోర్టులు అందజేయాలని సూచించారు. ప్రతీ ఉపాధ్యాయుడు తప్పనిసరిగా లెస్సన్ ప్లాన్, ఇయర్ ప్లాన్, టీచర్ డైరీ కలిగి ఉండాలన్నారు. పదో తరగతి విద్యార్థులంతా వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు కె.కామేశ్వరరావు, ఆర్.భాస్కరరావు, ఎం.వేణుగోపాలరావు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు

రారవే సమావేశం రేపు

రాజాం సిటీ: స్థానిక విద్యానికేతన్ స్కూల్‌లో ఈ నెల 29వ తేదీన రాజాం రచయితల వేదిక(రారవే) సమావేశం నిర్వహించనున్నట్లు వేదిక నిర్వాహకులు గార రంగనాథం ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త మూడడ్ల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో 'భూషణం కథలు' అనే అంశంపై రచయిత పొదిలాపు శ్రీనివాసరావు ప్రసంగించనున్నారని పేర్కొన్నారు. సమావేశానికి రచయితలు, కవులు, భాషాభిమానులు, సాహిత్యాభిలాషులు హాజరు కావాలని ఆయన కోరారు.

బాధ్యతల స్వీకరణ



అప్పారావు

బొబ్బిలి రూరల్: పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాసరావు పీఏగా పంచాయతీరాజ్ డీఈఈ సీహెచ్‌వీ అప్పారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతాయుతంగా పనిచేసి, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అప్పారావు తెలిపారు.

విద్యాప్రమాణాలు మెరుగుపరచాలి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని గుళ్లపాడు, ఉంగరాడమెట్ట, ఆమదాలవలస గ్రామ పాఠశాలలను ఆయన శుక్రవారం సందర్శించిన ఆయన చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాలను పెంచాలన్నారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా అందిస్తున్న మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం విద్యార్థులకు అందివ్వాలన్నారు.


మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం స్వామి

బొబ్బిలి రూరల్: మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని వీఓఏలకు వెలుగు ఏపీఎం పీపీ స్వామి సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి, బ్యాంకు లింకేజీల రికవరీని వేగవంతం చేయాలని కోరారు. సంఘాలు మరింత యాక్టివ్‌గా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న చేదోడు పథకం నగదును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చెత్త సంపద కేంద్రాల పరిశీలన



ఒమ్మి చెత్త సంపద కేంద్రంలో ఎరువును పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు

రాజాం సిటీ: మండలంలోని ఒమ్మి, కంచరాం గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాలను ఈఓపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. అనంతరం చెత్త సేకరణపై క్లాప్ మిత్రలకు పలు సూచనలు చేశారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా చెత్తను సేకరించి, సంపద కేంద్రాలకు తరలించాలని, అక్కడ తయారు చేసిన ఎరువును రైతులకు రాయితీపై అందించి, పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి దిలీప్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం అమ్మకాలకు పేర్లు నమోదు చేసుకోవాలి

రేగిడి: ధాన్యం అమ్మకాలకు రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని అంబకండి, సోమరాజుపేట, ఉంగరాడ గ్రామాల్లో మిగిలిన ధాన్యాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఇలా మిగిలిన ధాన్యం వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నామని, ఇంకా ధాన్యం విక్రయించాల్సిన రైతులు వెంటనే పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ఆటపాటలతో కూడిన విద్యనందించాలి



అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశమైన ఐసీడీఎస్ పీఓ రాజ్యలక్ష్మి

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని బాడంగి ఐసీడీఎస్ పీఓ కె.రాజ్యలక్ష్మి సూచించారు. శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–3లో సూపర్‌వైజర్ ఉషారాణి ఆధ్వర్యంలో జరిగిన అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశానికి హాజరైన ఆమె అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. సమయానికి విధులకు హాజరై, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు విధిగా పౌష్టికాహారం అందించాలన్నారు. టీహెచ్ఆర్ సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. అన్ని రికార్డులను ఆన్, ఆఫ్‌లైన్లలో సక్రమంగా నిర్వహించాలన్నారు. కిశోరి బాలికల ఆరోగ్యంపై తగిన సూచనలు, సలహాలు చేయాలన్నారు. చిన్నారుల ఎత్తు, బరువు తూకం చేసి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

పరీక్షలంటే భయపడొద్దు

- విద్యార్థులకు ప్రధాని మోదీ సూచన



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

తెర్లాం: పరీక్షలంటే భయపడొద్దని, ధైర్యంగా పరీక్షలు రాసినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. పరీక్ష పే చర్చ కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యార్థులతో ప్రధాని మోదీ శుక్రవారం మాట్లాడారు. ఈ కార్యక్రమానికి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. పబ్లిక్ పరీక్షలు అనగానే కొంతమంది విద్యార్థులు భయపడిపోతుంటారని, ఇది మంచిది కాదని మోదీ అన్నారు. సాధారణ రోజుల్లో ఎలా ఉంటున్నారో పరీక్షల రోజుల్లో కూడా అలాగే ఉండి, పరీక్షలు రాయాలన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల్లో నెలకొన్న భయం పోగొట్టేందుకు వారితో ఎక్కువగా పరీక్షలు రాయించడం చేయించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

- సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్

బొబ్బిలి రూరల్: కోర్టు ఆవరణలో ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ కోరారు. ఇదే విషయమై స్థానిక కోర్టు ఆవరణలో పోలీస్, ఎస్ఈబీ, న్యాయవాదులతో శుక్రవారం సమావేశమైన ఆయన సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న జాతీయ లోక్‌అదాలత్‌లో అన్ని రకాల సివిల్, రాజీ కావాల్సిన క్రిమినల్ కేసులను పరిష్కరిస్తామన్నారు. అలాగే పెండింగ్ కేసులను పరిశీలించి, రాజీ కుదిర్చే దిశగా చర్యలు చేపడతామన్నారు. రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కారమైతే కోర్టుల విలువైన సమయం వృథా కాదని, కక్షిదారులకు కూడా సమయం, డబ్బులు ఆదా అవుతాయన్నారు. అధికారులంతా లోక్‌అదాలత్‌పై విస్తృత ప్రచారం చేసి, కేసులు రాజీ అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.సరోజనమ్మ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.సౌమ్యజోసెఫ్, డీఎస్పీ మోహనరావు, సీఐ నాగేశ్వరరావు, ఎస్ఈబీ సీఐ ఆర్.జైభీమ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయండి



మాట్లాడుతున్న రైతు సంక్షేమ సంఘ అధ్యక్షుడు లక్షుంనాయుడు

బొబ్బిలి: పట్టణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్షుంనాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రైతు సంక్షేమ సంఘ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన 6 నెలలుగా విస్తరణ పనులు జరుగుతున్నాయని, పైపు లైన్ల పనులను సంబంధిత అధికారులు పూర్తి చేయకపోవడంతోనే పనులు పూర్తి కావడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం అసంపూర్తిగా ఉన్న పనులతో దుమ్మూధూళి చెలరేగి, అటువైపుగా వెళ్తున్న వారి కళ్లల్లో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రోడ్డుపై నీళ్లయినా చల్లితే ధూళి చెలరేగకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రైతు సంక్షేమ సంఘ ప్రతినిధులు ఆర్.తిరుపతిరావు, రవి, కూర్మినాయుడు, గోపాలం తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న చేదోడు' లబ్ధిదారుల అర్హతలపై ఆరా



బొబ్బిలి రూరల్: సెలూన్ షాపు వద్ద లబ్ధిదారుని అర్హతలపై ఆరాతీస్తున్న ఎంపీడీఓ భాస్కరరావు



బాడంగి: మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుదర్శన దొర

బొబ్బిలి రూరల్: మండలంలోని మెట్టవలస గ్రామంలో జగనన్న చేదోడు పథకానికి అర్హులైన వారి అర్హతలపై ఎంపీడీఓ అల్లు భాస్కరరావు శుక్రవారం ఆరాతీశారు. తొలుత గ్రామ సచివాలయానికి చేరుకున్న ఆయన పథకానికి ఎంపికైన వారి వివరాలను సేకరించారు. అనంతరం లబ్ధిదారుల ఇళ్లు, షాపుల వద్దకు వెళ్లి, వారి అర్హతలు అడిగి తెలుసుకున్నారు. అర్హులకే ప్రభుత్వ పథకాలు అందాలన్న సదుద్దేశ్యంతో సంబంధిత ధ్రువపత్రాలు పరిశీలిస్తున్నామన్నారు. జగనన్న చేదోడు పథకం కింద ఏటా పెట్టుబడి సాయం కోసం ప్రభుత్వం చేతివృత్తుల వారికి రూ.10 వేలు అందిస్తున్న విషయం తెలిసిందే.

బాడంగి: జగనన్న చేదోడు పథకం అర్హుల జాబితా సిద్ధం చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఇన్‌చార్జ్ ఆర్‌డీఓ బి.సుదర్శన దొర సూచించారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ఆయన రామభద్రపురం మండలం మినహా మిగిలిన మండలాల్లో అర్హుల జాబితా తయారీ పెండింగ్‌లో ఉందని, త్వరితగతిన పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. భూముల రీసర్వే కూడా వేగవంతం చేశామని, తోటపల్లి ప్రధాన కాలువకు అనుసంధానిస్తూ ఏర్పాటు చేసే పిల్లకాలువ కోసం భూసేకరణ చేశామని పేర్కొన్నారు.

31లోగా కల్యాణమస్తు దరఖాస్తు చేసుకోవాలి



సూచనలిస్తున్న ఎంపీడీఓ రమామణి

రామభద్రపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో ఎంపీడీఓ రమామణి శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీలోగా అర్హులైన వారితో కల్యాణమస్తు పథకానికి దరఖాస్తులు చేయించాలని సూచించారు. వివాహ తేదీకి వధువుకు 18 సంవత్సరాలు, వరుడికి 21 సంవత్సరాలు వయసు ఉండేవారు అర్హులన్నారు. సచివాలయ కార్యదర్శులంతా సకాలంలో ఆయుష్మాన్ భారత్ కూడా పూర్తి చేయాలన్నారు. అలాగే సచివాలయ అభివృద్ధి పనులు వేగవంతమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. సమయపాలన పాటిస్తూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

8 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



రైస్‌మిల్లు వద్ద ధాన్యం కొనుగోలు పరిశీలిస్తున్న అధికారులు

రాజాం: మండల పరిధిలోని రైతుల నుంచి మొత్తం 8 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వ్యవసాయ శాఖ ఏడీ చంద్రరావు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను శుక్రవారం సందర్శించిన ఆయన విక్రయానికి ధాన్యం సిద్ధం చేసిన రైతులతో కాసేపు మాట్లాడారు. తేమశాతం ఆధారంగా మద్దతు ధర లభిస్తుందని, రైతులంతా ఆర్‌బీకేల ద్వారా ధాన్యం విక్రయించుకోవాలని సూచించారు. దళారులను నమ్మవద్దన్నారు. తాము సేకరించిన ధాన్యం 8 మిల్లులకు తరలిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం అన్నపూర్ణ రైస్‌మిల్లు వద్ద రైతుల నుంచి వివరాలు సేకరించిన ఆయన మండలంలో మొత్తం 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రేణుకాసాయి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగులు

రాజాం: మండలంలోని కొండంపేటకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత సలాది తులసీరావు సోదరి సంగం పార్వతి రెండు రోజుల క్రితం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కంబాల జోగులు శుక్రవారం ఆ గ్రామం చేరుకుని, తులసీరావు, మృతురాలి భర్త సత్యారావును కలిసి పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి, పార్వతి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ కన్వీనర్లు పి. శ్రీనివాసరావు, ఎల్.రాజగోపాలనాయుడు, పి.లక్ష్మణరావు, వంగర ఎంపీపీ యు.సురేష్‌ముఖర్జీ, వంగర కన్వీనర్ కె.సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి




రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంఈఓ త్రినాథరావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని ఎం.ఆర్ అగ్రహారం ప్రాథమిక పాఠశాలను శుక్రవారం సందర్శించిన ఆయన పాఠశాలకు సంబంధించిన రికార్డులు, మరుగుదొడ్లు, జగనన్న గోరుముద్ద పథకం అమలును పరిశీలించారు. అనంతరం వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలు తెలుసుకున్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం అందించాలని, సిలబస్ ప్రకారం విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించాలని సిబ్బందిని కోరారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచాలి

రేగిడి: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచాలని జిల్లా విద్యాశాఖ అధికారి లింగేశ్వర్ రెడ్డి సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం మండల స్థాయి విద్యా సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన సదస్సులో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వద్దని, సమయానికి పాఠశాలకు హాజరు కావాలని తెలిపారు. ప్రతీ విద్యార్థి విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వందకు వంద శాతం ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందేలా చేసి, ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా చూడాలన్నారు. ఉపాధ్యాయుల బోధనోపకరణాల్లో లెస్సన్ ప్లాన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మనబడి నాడు–నేడు పనులు కూడా త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు, మండల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



వంగర: వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీఓ సంగంనాయుడు



సంతకవిటి: వేతనదారుల మస్టర్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘునాథాచారి

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురం, రంగారాయపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి శుక్రవారం పరిశీలించారు. అనంతరం వేతనదారులకు పలు సూచనలు చేశారు. రెండు పూటలా కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. పనిలోకి రాని వారి మస్టర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వంగర: రెండు పూటలా ఉపాధి హామీ పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందని ఏపీఓ సామంతుల సంగంనాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని పటువర్ధనం, సీలయ్యవలస, బాగెంపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేయాలని, జాబ్‌కార్డు ఉన్న వారినే పనులకు అనుమతించాలన్నారు. పని ప్రదేశంలో టెంట్, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.